సాక్షి
నల్లగొండ
ఆదివారం । 26 । నవంబర్ । 2023



పెళ్లి బృందం బస్సు బోల్తా
చింతపల్లిలో పెళ్లి బృందం బస్సు బోల్తాపడిన ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందగా పలువురికి గాయాలయ్యాయి. - 6లో



మూడో రోజు చండీయాగం
యాదాద్రిలోని శ్రీపర్వత వర్థిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శత చండీ యాగం మూడో రోజుకు చేరింది. - 6లో



'పోస్టల్' ఓటేసిన అధికారులు
నల్లగొండలో పలు శాఖల అధికారులు శనివారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. - 6లో

న్యూస్‌రీల్

27 మండలాల్లో వర్షం

నల్లగొండ అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు 27 మండలాల్లో వర్షం కురిసింది. 3.1 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చందంపేట మండలంలో 30.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అలాగే గుర్రంపోడు 12.1 చండూరు 9.3, కనగల్ 8.9, మునుగోడు 5.9 మ మిల్లీమీటర్ల వర్షం పడింది. పీఏపల్లి 5.0, గుండ్లపల్లి 4.2, నార్కట్‌పల్లి 3.6, మర్రిగూడ 2.9, చిట్యాల 2.7, దేవరకొండ 2.3, అనుముల హాలియా 1.7, గట్టుప్పల్ 1.5, తిప్పర్తి 1.4, చింతపల్లి 1.3, నల్లగొండ 1.2, పెద్దవూర 1.1, శాలిగౌరారం 0.9, కట్టంగూరు 0.7, కేతేపల్లి 0.7, మాడుగులపల్లి 0.5, దామరచర్ల 0.5, మిర్యాలగూడ 0.4, తిరుమలగిరిసాగర్ 0.4, నాంపల్లి 0.3, నిడమనూరు 0.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న అంజన్‌రావు

చండూరు, నాంపల్లి: బాలలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు అంజన్‌రావు, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ అధికారి సయ్యద్ మతీన్‌అహ్మద్ అన్నారు. శనివారం వారు చండూరులోని మరియానికేతన్, నాంపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పలు రకాల రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మైండ్ మ్యాప్ విధానంలో సబ్జెక్టులను చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని సూచించారు. వారివెంట సీడబ్ల్యూసీ బాధ్యుడు ఈద భాస్కర్, చండూరు ఎంఈఓ గురువారావు, నాంపల్లి కేజీబీవీ ప్రిన్స్‌పాల్ విజయశ్రీ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.

పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా సాగాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీఓ చెన్నయ్య

మిర్యాలగూడ: పోలింగ్ పారదర్శకంగా సాగేలా ఎన్నికల సిబ్బంది జాగ్రత్తలు వహించాలని మిర్యాలగూడ నియోజవకర్గ రిటర్నింగ్ అధికారి, స్థానిక ఆర్డీఓ చెన్నయ్య అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మిర్యాలగూడ పట్టణంలోని కేఎన్ఎం డిగ్రీ కళాశాలలో పీఓలు, ఓపీఓలకు శిక్షణ నిర్వహించారు. అందులో భాగంగా శనివారం ఆర్డీఓ, ఆర్ఓ చెన్నయ్య శిక్షణకు పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో ఏమైనా సందేహాలుంటే ముందే తీర్చుకోవాలని సూచించారు. శిక్షణలో అధికారులు, సిబ్బంది ఉన్నారు.

వలస ఓటర్లే నిర్ణేతలు!

ఎనిమిది నియోజకవర్గాల్లో వారి ప్రభావం
- ఉమ్మడి జిల్లాలో 1.70 లక్షల మందికి పైగా వలస ఓటర్లు
- స్వస్థలాల్లో ఓటేసేందుకు రప్పిస్తున్న నాయకులు
- కొన్నిచోట్ల రవాణా సదుపాయం కల్పించేలా ఏర్పాట్లు
- మరికొన్ని చోట్ల రాను పోను ఖర్చులు, ఓటుకు ఇంత ఇస్తామంటూ బేరసారాలు
- హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉంటున్న వారితో ప్రత్యేక సమావేశాలు

జంగ్ తెలంగాణ



ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల వారీగా మొత్తం ఓటర్లు, వలస ఓటర్లు (అంచనా)

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	వలస ఓటర్లు
నల్లగొండ	2,44,560	9,500
నకిరేకల్	2,50,547	15,000
మునుగోడు	2,52,648	25,000
దేవరకొండ	2,51,622	20,000
నాగార్జునసాగర్	2,33,412	12,000
మిర్యాలగూడ	2,31,391	2,000
సూర్యాపేట	2,41,799	14,000
తుంగతుర్తి	2,55,017	25,000
హుజూర్‌నగర్	2,42,711	6,000
కోదాడ	2,41,554	6,400
ఆలేరు	2,33,266	30,000
భువనగిరి	2,16,941	6,000

2018 అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడలో బీఆర్ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్య యాదవ్‌కు 89,115 ఓట్లు లభించగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్.పద్మావతిరెడ్డికి 88,359 ఓట్లు వచ్చాయి. కేవలం 756 ఓట్ల తేడాతో ఆమె ఓడిపోయారు. తుంగతుర్తిలోనూ బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్ కుమార్‌కు 90857 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి అద్దంకి దయాకర్‌కు 89,010 ఓట్లు లభించాయి. తేడా 1847 ఓట్లు మాత్రమే. అభ్యర్థుల గెలుపోటములకు మధ్య తేడా ఒక్క ఓటు చాలు. ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమే. అందుకే ప్రతి ఓటు పొందేలా పార్టీలు ప్రణాళికతో పనిచేస్తున్నాయి. ఇందులో భాగంగా వలస ఓటర్లపైనా ప్రత్యేక దృష్టి సారించాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలు వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాయి. – సాక్షి ప్రతినిధి, నల్లగొండ

ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాలకుగాను 8 నియోజకవర్గాల్లో వలస ఓటర్లే అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నల్లగొండ, నకిరేకల్, మునుగోడు, దేవరకొండ, నాగార్జునసాగర్, సూర్యాపేట, తుంగతుర్తి, ఆలేరు నియోజకవర్గాల్లో భారీ సంఖ్యలో వలస ఓటర్లు ఉన్నారు. ఇక మిగతా నియోజకవర్గాల్లోనూ వలస ఓటర్ల సంఖ్య అధికంగానే ఉంది. ఈ నేపథ్యంలో ఈసారి పార్టీలు వారిపై ప్రత్యేక దృష్టి సారించాయి. వారిని ప్రసన్నం చేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఆకట్టుకునేందుకు తాయిలాల ఆశ

వలస ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీలు తాయిలాలను ఆశగా చూపుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు వలస ఓటర్లు ఎక్కడెక్కడున్నారో తెలుసుకొని మరీ, వారితో సంప్రదింపులు జరుపుతున్నారు. నియోజకవర్గానికి చెందిన ఓటర్లు కొందరు ఉద్యోగ రీత్యా, మరికొందరు పిల్లల చదువుల కోసం, ఇంకొందరు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం, పేద కుటుంబాలకు చెందిన అనేక మంది కూలి పనులకోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి నివసిస్తున్నారు. వారి ఓట్లు మాత్రం స్థానికంగానే ఉన్నాయి. దీంతో వారిని పోలింగ్ రోజున రప్పించే ఏర్పాట్లలో పార్టీల నేతలు నిమగ్నమయ్యారు. వలస వెళ్లిన ఓటర్ల బంధువుల ఇళ్లకు వెళ్లి వారి ఫోన్ నంబర్లు, అడ్రస్‌లు తీసుకుని వారితో మాట్లాడుతున్నారు. చుట్టు పక్కల ఇంటి వారి నుంచి కూడా వలస ఓటర్ల సమాచారం తీసుకుని మాట్లాడుతున్నారు. పట్టణాల్లోని వార్డు ఇన్‌చార్జీలు, మండల, గ్రామ ఇన్‌చార్జీలు, పార్టీల నేతలు వలస ఓటర్లతో సంప్రదింపులు జరుపడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్ పరిసరాల్లో ఉంటున్న వారికి కారు వంటి వాహన సదుపాయం కల్పిస్తామని, ముంబై, చెన్నై, సూరత్, భీవండి, ఇతర రాష్ట్రాలు, దూర ప్రాంతాల్లో ఉంటున్న వారికి రానుపోనూ రవాణా ఖర్చులు, గిఫ్టులు ఇవ్వడంతోపాటు ఓటుకు ఇంత ఇస్తామంటూ వల వేస్తున్నారు.

ప్రత్యేక సమావేశాలపై దృష్టి

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ప్రధాన పోటీ ఉండటం, కొన్ని నియోజకవర్గాల్లో బీజేపీ కూడా పట్టుకోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో గెలుపోటముల్లో వలస ఓటర్లు కీలకంగా మారే అవకాశం ఉంది. అందుకే అన్ని పార్టీల అభ్యర్థులు వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాయి. హైదరాబాద్ పరిసరాల్లో పెద్దఅంబర్‌పేట్, హయత్‌నగర్, కుంట్లూరు, బీఎన్‌రెడ్డి నగర్, వనస్థలిపురం ఎల్బీనగర్, ఉప్పల్, బోడుప్పల్, నారపల్లి, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్ తదితర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టిన రాజకీయ పార్టీలు వారిని ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నాయి. వారితో ప్రత్యేక సమావేశాలకు తెరతీశాయి. ఇటీవల మునుగోడు నియోజకవర్గానికి చెందిన బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి హైదరాబాద్ వనస్థలిపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. మిగతా పార్టీల అభ్యర్థులు కూడా వలస ఓటర్లతో సమావేశాల నిర్వహణపై దృష్టి సారించారు.

interview



'బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సారథ్యంలో మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలే నా ప్రచార అస్త్రాలు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ఎదురునిలిచే స్థాయిలో ఏ పార్టీ లేదు. గత రెండు పర్యాయాలు ప్రజలకు అందుబాటులో ఉన్నా. ప్రజా ఆశీర్వాదంతో హ్యాట్రిక్ విజయం సాధిస్తాననే నమ్మకం ఉంది' అంటున్నారు బీఆర్ఎస్ పార్టీ మిర్యాలగూడ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.
- మిర్యాలగూడ

బీఆర్ఎస్‌దే విజయం

- ప్రభుత్వ పథకాలే నా ప్రచార అస్త్రాలు
- గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 90 శాతం నెరవేర్చా
- దళితబంధు, బీసీ బంధు, గృహలక్ష్మి.. నిరంతర ప్రక్రియ
- యాదాద్రి పవర్‌ప్లాంట్ ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు

బీఆర్ఎస్ మిర్యాలగూడ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు

భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా రూ.72,815 కోట్ల రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేశాం. రైతుబీమా పథకం ద్వారా మిర్యాలగూడ నియోజకవర్గంలో 157 మందికి రూ.7.85 కోట్ల బీమా అందించాం. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా కేసీఆర్ పేదలకు అండగా నిలిచాం. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాం. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్లు అందిస్తున్నాం. కులవృత్తులకు చేయూతనిచ్చాం.

ఇంటింటికీ తాగునీరు అందించా

గత ఎన్నికల్లో నేను మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ఇంటింటికీ తాగునీటిని అందించాను. అన్ని గ్రామాలకు లింకురోడ్లు, నియోజకవర్గం నుంచి మండల కేంద్రాలకు డబుల్‌రోడ్లు నిర్మించాం. ఇలా నేను ఇచ్చిన ప్రతి హామీని 90శాతం వరకు పూర్తి చేశాను. మిగతా పనులతోపాటు ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను తిరిగి అధికారంలోకి వచ్చాక చేస్తాను.

ఏరియా ఆస్పత్రి స్థాయిని పెంచాం..

నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి గతంలో ఉన్న వంద పడకల ఏరియా ఆసుపత్రిని 200 పడకల స్థాయికి పెంచాం. అందుకుగాను నూతన భవన నిర్మాణానికి రూ.16 కోట్లు మంజూరు చేయించాను. ఈ పనులను త్వరగా పూర్తి చేసి మరో 50 పడకల భవన నిర్మాణానికి తగినన్నీ నిధులు సమీకరించి జిల్లా ఆసుపత్రి స్థాయికి తీసుకెళ్తాను.

యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తా

బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి ఏర్పడ్డాక నియజకవర్గంలో గృహలక్ష్మి, బీసీబంధు, దళిత బంధు పథకాలను అర్హులకు అందిస్తాను. ఈ పథకాలన్నీ నిరంతర ప్రక్రియ. యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌ను డిసెంబర్‌లోపు రెండు యూనిట్లు ప్రారంభించాలని అనుకున్నాం. కానీ, ఈ లోపు ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభానికి అంతరాయం కలిగింది. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత ప్రారంభిస్తాం. పవర్‌ప్లాంట్ వల్ల వేలాది మంది నిరుద్యోగులు, యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరుకుతుంది. ఎన్‌బీఆర్ ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగులకు ఉచితంగా కోచింగ్ ఇప్పించి ప్రభుత్వ కొలువులు సాధించేలా కృషి చేస్తాను. ప్రైవేట్ రంగంలో యువత ఉద్యోగాలు సాధించడానికి పలు కంపెనీలను రప్పించి జాబ్‌మేళా నిర్వహించి నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాను.

రూ.2800 కోట్ల పనులు చేపట్టాం..

మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా రూ.2800 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టాను. రూ.2700 కోట్ల సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాను. నియోజకవర్గంలో రూ.600 కోట్లతో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఐదు ఎత్తిపోతల పథకాల పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాను.

ప్రచారంలో దూసుకెళ్తున్నాం..

అక్టోబర్ 31న సీఎం కేసీఆర్ ప్రజాశీర్వాద సభ, ఈనెల 20న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాకతో కార్యకర్తల్లో మరింత జోష్ వచ్చింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నాం. ఎన్నికల్లో నేను హ్యాట్రిక్ విజయం సాధించడంతోపాటు కేసీఆర్ కూడా మూడోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యం.

మాది ప్రజా మేనిఫెస్టో

ఇప్పటివరకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిన పథకాలన్నీ విజయవంతంగా అమలు చేయడంతో.. ప్రస్తుతం పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోను సైతం సీఎం కేసీఆర్ అమలు చేస్తారనే నమ్మకం ప్రజల్లో బలంగా ఉంది. ఆసరా పింఛన్‌దారులకు రూ.5 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, రూ.400కే గ్యాస్ సిలిండర్, రేషన్‌కార్డు దారులకు సన్న బియ్యం అందించనున్నాం. రైతుబంధు రూ.16 వేలకు పెంచుతాం. పేదలకు రూ.5 లక్షల కేసీఆర్ బీమా, రూ.15లక్షల వరకు ఆరోగ్యరక్ష వంటి అనేక పథకాలను అధికారంలోకి రాగానే అమలు చేస్తాం.

'రైతుబంధు'కు ఓకే

- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన ఎన్నికల కమిషన్
- 28న అందనున్న పెట్టుబడిసాయం
- ముందుగా ఎకరా రైతులకు జమ
- డిసెంబర్ 1నుంచి దశల వారీగా..

నల్లగొండ అగ్రికల్చర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుబంధు పెట్టుబడి సాయం నిలిపివేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే ఈ పథకం పాతది కాబట్టి రైతులకు పెట్టుబడి సాయం జమచేయడానికి అనుమతించాలని ఎన్నికల కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. దీంతో శుక్రవారం ఎన్నికల కమిషన్ రైతుబంధు సాయం జమచేయడానికి అనుమతి ఇచ్చింది. ఈనెల 28 వరకు మాత్రమే జమచేయాలని ఆదేశించింది. అయితే ఈనెల 30న పోలింగ్ ఉన్నందున అదే రోజుతోపాటు దానికి ముందురోజు అనగా 29న కూడా జమ చేయవద్దని షరతు విధించింది. 26న ఆదివారం, 27న సోమవారం కూడా బ్యాంకులకు సెలవు దినాలు ఉన్నాయి. దీంతో కేవలం ఒక్క 28వ తేదీ మంగళవారం రోజున మాత్రమే ఎకరం వరకు సాగు భూమి ఉన్న రైతులకు రైతుబంధు డబ్బులు రూ.5వేల చొప్పున జమచేసే అవకాశం ఉంది. ఆ తరువాత డిసెంబర్ 1వ తేదీ నుంచి దశల వారీగా రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమ కానున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా 3,00,769 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రత కట్టుదిట్టం



అనిశెట్టి దుప్పలపల్లి గోదాంలోని కౌంటింగ్ హాళ్లలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కర్ణన్ తదితరులు

- జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్

నల్లగొండ: ఈ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ ఆదేశించారు. శనివారం ఆయన తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లిలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాంలో ఏర్పాటు చేసిన నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ, మునుగోడు, నకిరేకల్, నాగార్జున సాగర్ నియోజకవర్గాల కౌంటింగ్ హాళ్లు, స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలతోపాటు నిరంతర విద్యుత్ సరఫరాకు జనరేటర్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రశాంతంగా కౌంటింగ్ జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ తిరుపతయ్య, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి, పరిశ్రమల కేంద్రం జీఎం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్ ఆదేశించారు. నల్లగొండలోని జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఐసీడీఎస్, స్వీప్, నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పోలింగ్ స్టేషన్లలో కల్పించిన వసతులను ముందస్తుగా పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, స్వీప్ నోడల్ అధికారి ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీఓ విష్ణువర్ధన్, కృష్ణవేణి పాల్గొన్నారు.

బీజేపీతోనే మునుగోడు అభివృద్ధి

- గత పాలకులు పట్టించుకోలేదు
- చౌటుప్పల్ రోడ్ షోలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా
- చలమల్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని ప్రజలకు పిలుపు



చలమల్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని చౌటుప్పల్ పట్టణంలో నిర్వహించిన రోడ్ షోకు హాజరైన జనం



మాట్లాడుతున్న అమిత్‌షా, చిత్రంలో గంగిడి మనోహర్‌రెడ్డి, బూర నర్సయ్య గౌడ్, అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి

చౌటుప్పల్ : వెనుకబాటుకు గురైన మునుగోడు నియోజకవర్గం ప్రగతిపథంలో పయనించాలంటే బీజేపీతోనే సాధ్యమని, అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పువ్వుకు ఓటు వేసి గెలిపించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. మునుగోడు బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డికి మద్దతుగా శనివారం చౌటుప్పల్‌లో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత పాలకులు మునుగోడును పట్టించుకోలేదని, నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి చలమల్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడబోతుందన్నారు. కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ సర్కార్ ఉంటే నియోజకవర్గం కూడా అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. ఓ వైపు రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వం ఉందని, మరోవైపు అమ్ముడుపోయే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారని, ఈ విషయాన్ని గమనించి ప్రజలంతా బీజేపీకి అండగా నిలవాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు అయోధ్యలోని రామమందిర దర్శనం ఉచితంగా కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే సంవత్సరం జనవరి 22వ తేదీన రామ మందిరాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభిస్తారని తెలిపారు.

చికెన్ ధర దిగింది

కిలో 155 రూపాయలు
- నెల రోజుల క్రితం రూ.285పైమాటే..
- కార్తీకమాసం కావడమే కారణం



చికెన్ ధర ఇలా.. (కిలో రూ.లలో..)

	నెలక్రితం	ప్రస్తుతం
విత్ స్కిన్	285	155
స్కిన్ లెస్	310	180

నల్లగొండ టౌన్: చికెన్ రేటు రోజురోజుకూ తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం కిలో చికెన్ స్కిన్‌తో రూ.155 ధర పలుకుతోంది. నెల రోజుల క్రితం వరకు కిలో చికెన్ ధర (స్కిన్‌తో) రూ.270 నుంచి రూ.285పైగా పలికింది. అప్పుడు సామాన్యులు చికెన్ తినాలంటేనే భయపడ్డారు. ప్రస్తుతం కార్తీకమాసం కావడం, అయ్యప్పమాలలు, ఆంజనేయస్వామి మాలలు ధరిస్తున్న నేపథ్యంలో చికెన్ వాడకం సగానికి సగం పడిపోయింది. దీంతో చికెన్ ధర కూడా తగ్గిందని చికెన్ సెంటర్ల నిర్వాహకులు అంటున్నారు. కార్తీకమాసం ముగిసే వరకు ధరలు ఇలానే ఉండే అవకాశం ఉంటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. అయితే కోళ్ల ఉత్పత్తి యథావిధిగా కొనసాగుతున్నప్పటికీ చికెన్ వాడకం తగ్గడంతో కోళ్ల పెంపకందారులు నష్టాలపాలయ్యే అవకాశం లేకపోలేదు. ఇదిలా ఉంటే ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ తేదీ సమీపిస్తున్న కారణంగా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వివిధ పార్టీల నేతలు విందులు చేసే అవకాశం ఉన్నందున రెండు, మూడు రోజుల్లో వ్యాపారం పెరిగే అవకాశం ఉంటుందన్న చికెన్ సెంటర్ నిర్వాహకులు భావిస్తున్నారు.

కార్తీక మాసం కావడంతో ధర తగ్గింది

ప్రస్తుతం కార్తీకమాసం కావడంతో మహిళలు చాలా వరకు చికెన్ ముట్టరు. దీంతో చికెన్ కొనే వారు సగానికి సగం తగ్గడంతో చికెన్ రేటు కూడా పడిపోయింది. నెల క్రితం కిలో రూ.285 వరకు ఉన్న చికెన్ నేడు రూ.155 మాత్రమే అమ్ముతున్నాము. ఎన్నికలు ఉన్నందున ఒకటి రెండు రోజుల్లో గిరాకీ పెరిగే అవకాశం ఉంటుందని అనుకుంటున్నా.
–నాగయ్య, చికెన్‌సెంటర్ యజమాని, నల్లగొండ

రాజ్యాంగ విలువల పరిరక్షణ అందరి బాధ్యత

నల్లగొండ రూరల్: రాజ్యాంగ విలువల పరిరక్షణ అందరి బాధ్యత అని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంజీయూలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భిన్న సంస్కృతులు, జాతుల ప్రజానీకానికి ఆమోదయోగ్యమైన సమ్మిళిత సమాజానికి పునాది మన రాజ్యాంగం అని తెలిపారు. ప్రతిఒక్కరూ రాజ్యాంగాన్ని చదవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం విద్యార్థుల చేత రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, ఆడిట్ సెల్ డైరెక్టర్ అంజిరెడ్డి, మద్దిలేటి, అన్నపూర్ణ, ప్రశాంతి, శ్రీధర్, జ్యోతి, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

విజయ సంకల్ప సభ



హుజూర్‌నగర్‌లో నిర్వహించిన విజయ సంకల్ప సభలో అభివాదం చేస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, చిత్రంలో హుజూర్‌నగర్ బీజేపీ అభ్యర్థి చల్లా శ్రీలతారెడ్డి, కోదాడ జనసేన అభ్యర్థి మేకల సతీష్‌రెడ్డి



జేపీ నడ్డాకు నమస్కరిస్తున్న హుజూర్‌నగర్ బీజేపీ అభ్యర్థి చల్లా శ్రీలతారెడ్డి, చిత్రంలో కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

• బీఆర్‌ఎస్ జోష్



బొమ్మలరామారం మండలం చీకటిమామిడిలో మంత్రి హరీశ్‌రావు కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు



చీకటిమామిటి కార్నర్ మీటింగ్‌లో గులాబీ కండువాలు ఊపుతున్న బూడిద భిక్షమయ్య తదితరులు



చీకటిమామిడి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

జంగ్ తెలంగాణ

అమిత్‌షా రోడ్ షో కొనసాగిందిలా..



చౌటుప్పల్‌లో నిర్వహించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రోడ్ షో సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలు



అభివాదం చేస్తున్న అమిత్ షా, చిత్రంలో మునుగోడు అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి, బూర నర్సయ్యగౌడ్, గంగిడి మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్: మునుగోడు బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డికి మద్దతుగా చౌటుప్పల్ పట్టణంలో శనివారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రోడ్ షో నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లిలో గల ముస్కు మధుసూదన్‌రెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు మధ్యాహ్నం 2.20 గంటలకు అమిత్ షా చేరుకున్నారు. ఆయనకు భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, మునుగోడు బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి తదితర నాయకులు స్వాగతం పలికారు. అనంతరం అమిత్ షా ప్రచార రథం పైకి ఎక్కి రోడ్ షో ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలతో కలిసి తంగడపల్లి, తంగడపల్లి రోడ్డు, జాతీయ రహదారి, బస్టాండ్ జంక్షన్ నుంచి చిన్నకొండూర్ చౌరస్తా వరకు రోడ్‌షో కొనసాగింది. ప్రచార రథంపై నుంచి అమిత్‌షా అభివాదం చేస్తూ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. భారత్ మాతాకీ జై, జైశ్రీరాం అంటూ ఆయన స్వయంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనూరి వీరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, బీజేపీ మండల, మున్సిపల్ అధ్యక్షులు రిక్కల సుధాకర్‌రెడ్డి, ఊడుగు వెంకటేశం, సర్పంచ్‌లు కాయితి రమేష్, బాతరాజు సత్యం, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, మునగాల తిరుపతిరెడ్డి, ఆలె చిరంజీవి, శాగ చంద్రశేఖర్‌రెడ్డి, దాసోజు భిక్షమాచారి, పాలకూర్ల జంగయ్య, ఊడుగు యాదయ్య, రమనగోని దీపిక, కదారి కల్పన, కైరంకొండ అశోక్, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు భువనగిరికి సీతారాం ఏచూరి రాక

భువనగిరిటౌన్: భువనగిరి, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల సీపీఎం అభ్యర్థుల తరఫున ప్రచారం చేసేందుకు గాను ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు భువనగిరిలో రోడ్ షో నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రోడ్ షోకు సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. రోడ్ షోకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అమిత్‌షా సభను జయప్రదం చేయాలి

సాక్షి యాదాద్రి: కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు బీజేపీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని భువనగిరి బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరి వద్ద సభా ఏర్పాట్లను జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావుతో కలిసి ఆయన పరిశీలించారు. అధికారులు, పార్టీ నాయకులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్నం 2గంటలకు సభ ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. ఈ సభకు 50 వేల మందిని తరలించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. తనతో పాటు ఆలేరు నియోజకవర్గ అభ్యర్థి పడాల శ్రీనివాస్ సభలో పాల్గొంటారని తెలిపారు. సభా వేదిక పక్కనే హెలిపాడ్ ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణాన్ని ఎస్పీజీ, కేంద్ర భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి.



సభ నిర్వహించే స్థలంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న గూడూరు నారాయణరెడ్డి తదితరులు

పోస్టల్ బ్యాలెట్‌ను అడ్డుకున్న వారిపై కేసు

నడిగూడెం : పోస్టల్ బ్యాలెట్‌ను అడ్డుకున్న వారిపై శనివారం నడిగూడెం పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. నడిగూడెం మండల కేంద్రంలో ఈ నెల 23న పోస్టల్ బ్యాలెట్ ద్వారా పలువురు ఓటు వేస్తున్నప్పుడు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఈ నెల 24న తహసీల్దారు హేమామాలిని పోలీసులకు ఫిర్యాదు చేయగా శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపారు.

తాయిలాలకు అంగీకరించినా నేరమే..

భువనగిరి: ఎన్నికల సమయంలో పలువురు అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించేందుకు మద్యం, నగదు, క్రీడా సామగ్రి వంటివి ఇస్తూ ప్రలోభాలకు గురిచేస్తుంటారు. అభ్యర్థులు వీటిని పంచుతూ పట్టుబడితే కేసు నమోదు చేస్తారు. అయితే వాటిని తీసుకున్నా.. లేదా తీసుకోవడానికి అంగీకరించినా ప్రజా ప్రాతినిధ్య చట్టం–1951(సెక్షన్–123) ప్రకారం నేరమే అవుతుంది. తాయిలాలు తీసుకుంటూ దొరికితే జైలు శిక్ష లేదా జరిమానా లేదంటే రెండూ కలిపి విధించే అవకాశం ఉంది.

‘పోస్టల్’ ఓటేసిన అధికారులు

నల్లగొండ: పోలింగ్ విధుల్లో ఉన్న అధికారులు, ఇతర సిబ్బంది నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నియోజకవర్గాల వారీగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో శనివారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. కళాశాలలో శిక్షణకు హాజరైన ఓపీఓలు, పోలీస్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లలో కొందరు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమాన్ని తనిఖీ చేసేందుకు వచ్చిన కలెక్టర్ కర్ణన్ ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటేసేందుకు భారీ క్యూ ఉండడంతో కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇరిగేషన్ డీఈ చక్రపాణి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేశారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి రవి, శిక్షణ అధికారి వెంకయ్య, మ్యాన్ పవర్ నోడల్ అధికారి పార్వతీశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఓటు వేసిన ఇరిగేషన్ డీఈ చక్రపాణి

ఎన్నికల సిత్రాలు

• పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా..



చిలుకూరు: సైకిల్‌పై మొక్కలు పెట్టుకొని ప్రచారం చేస్తున్న పర్యావరణవేత్త, కోదాడ స్వతంత్ర అభ్యర్థి కొల్లు లక్ష్మీనారాయణ

• ఓటరు మనసు ‘దోసే’స్తా..



యాదగిరిగుట్ట: ప్రచారంలో భాగంగా యాదగిరిగుట్టలో దోశలు వేస్తున్న ఆలేరు కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల అయిలయ్య

అదుపుతప్పి పెళ్లి బృందం బస్సు బోల్తా

- పెళ్లి కుమారుడి నాయనమ్మ మృతి.. 16మందికి గాయాలు
- క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమం
- డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణం
- చింతపల్లి మండల కేంద్రంలో ఘటన



భారతమ్మ (ఫైల్)



ప్రమాద స్థలం వద్ద రోదిస్తున క్షతగాత్రులు



క్షతగాత్రులను తరలిస్తున్న పోలీసులు

చింతపల్లి: మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున పెళ్లి బృందం బస్సు అదుపుతప్పి బోల్తాకొట్టడంతో పెళ్లికుమారుడి నాయనమ్మ మృతిచెందగా మరో 16మందికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్‌లోని హయత్‌నగర్ పరిధి కుంట్లూరుకు చెందిన హరీష్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన అనూషారెడ్డితో ఈ నెల 24న అక్కడే వివాహం జరిగింది. వేడుకలో పాల్గొనేందుకు హరీష్‌రెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు 40మంది శుక్రవారం హైదరాబాద్ నుంచి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో వినుకొండకు బయల్దేరారు. అదేరోజు మధ్యాహ్నం వేడుక ముగిసిన తర్వాత పెళ్లి బృందం సభ్యులు సరదాగా గడిపారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత హైదరాబాద్‌కు బస్సులో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో చింతపల్లిలోని సాయిబాబా దేవాలయం సమీపంలోకి రాగానే డ్రైవర్ గఫూర్ నిద్రమత్తుతో బస్సు అదుపుతప్పింది. బస్సు రోడ్డుకు ఎడమవైపునకు దూసుకెళ్తున్న క్రమంలో పెళ్లి బృందం సభ్యులు కేకలు వేశారు. దీంతో డ్రైవర్ తేరుకుని బస్సును కుడివైపు తిప్పి రోడ్డు ఎక్కించే క్రమంలో బోల్తా కొట్టింది. ప్రమాదంలో పెళ్లి కుమారుడి నాయనమ్మ సప్పిడి భారతమ్మ(64) అక్కడికక్కడే మృతిచెందగా బంధువులు వసంత, నరేందర్‌రెడ్డి, కతిక్‌రెడ్డి, సునంద, ప్రణవి, నిర్మల, శ్రేయారెడ్డి, పద్మ, శ్రీహిత, హర్షిత, శ్యామ్‌సుందర్‌రెడ్డి, చైతన్య, ప్రవీణ, నర్సింహారెడ్డిలకు స్వల్ప, లింగమ్మ, వెంకటనర్సింహారెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డంగా బస్సు పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు జేసీబీల సహాయంతో బస్సును పక్కకు తీయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. తీవ్రంగా గాయపడిన లింగమ్మ, వెంకటనర్సింహారెడ్డిల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మృతురాలి కుమారుడు వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.

చౌటబావి గ్రామంలో విషాదం

నార్కట్‌పల్లి : బస్సు అదుపుతప్పి బోల్తా కొట్టిన ప్రమాదంలో పెళ్లికుమారుడి నాయనమ్మ సప్పిడి భారతమ్మ(64) మృతిచెందడంతో ఆమె స్వగ్రామం నార్కట్‌పల్లి మండలం చౌటబావిలో విషాదం అలుముకుంది. చౌటబావి గ్రామానికి చెందిన సేనయ్యరెడ్డి, భారతమ్మ దంపతులకు ఇద్దరు కుమారుడు, కుమార్తె సంతానం. అందరికీ వివాహాలు జరిపించారు. పిల్లల కుటుంబాలు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. గుంటూరు జిల్లా వినుకొండలో జరిగిన సేనయ్యరెడ్డి సోదరుడి మనువడు హరీష్‌రెడ్డి వివాహానికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. భారతమ్మ అంత్యక్రియలు హైదరాబాద్‌లోనే నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

ధాన్యం విక్రయించి వెళ్తూ మృత్యుఒడికి..

• రోడ్డు ప్రమాదంలో రైతుతో పాటు ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం



సోమ్లానాయక్, దీపక్‌కుమార్ మృతదేహాలు

కేతేపల్లి: ధాన్యం విక్రయించి వెళ్తున్న రైతుతో పాటు ట్రాక్టర్ డ్రైవర్‌ను డీసీఎం రూపంలో మృత్యువు కబళించింది. కేతేపల్లి మండల పరిధిలో జరిగిన ఈ దుర్ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి సమీపంలోని మంగళతండాకు చెందిన తెజావత్ సోమ్లానాయక్(57) వానాకాలం సీజన్‌లో పండించిన వరి ధాన్యం బస్తాలను అమ్మేందుకు ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని శుక్రవారం ఉదయం కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్‌కు వచ్చారు. గ్రామంలో గల చాముండేశ్వరి రైస్ మిల్లులో ధాన్యం విక్రయించిన అనంతరం శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట సమయంలో ట్రాక్టర్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్ వద్ద అండర్‌పాస్ పైకి చేరుకోగానే సూర్యాపేట వైపు వెళ్తున్న అంబులెన్స్ వీరి ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. వారు తేరుకుంటుండగానే అదే మార్గంలో అతి వేగంగా వస్తున్న డీసీఎం రోడ్డు పక్కన ఉన్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న రైతు సోమ్లానాయక్ అక్కడికక్కడే మృతిచెందగా డ్రైవర్ బాగోతు దీపక్‌కుమార్(30)కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న పోలీసులు దీపక్‌కుమార్‌ను సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు సోమ్లానాయక్ కుమారుడు రామ్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కేతేపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

యాదాద్రిలో మూడోరోజు శత చండీ యాగం

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శత చండీ యాగం పూజలు శనివారం 3వ రోజుకు చేరుకున్నాయి. మహాశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యాగ మండపంలో శత చండీ యాగం చేపట్టారు. అర్చకులు దేవతా పూజలు, చండీ హవనాలు, చండీ పారాయణాలను వైభవంగా జరిపించారు. ఈ వేడుకల్లో ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి దంపతులు, అర్చకులు, పారాయణికులు, అధికారులు పాల్గొన్నారు.

టీడీఎస్ కమిషనర్ మేఘనాథ్ పూజలు

యాదాద్రీశుడిని టీడీఎస్ కమిషనర్ మేఘనాథ్ దంపతులు దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. మేఘనాథ్ దంపతులకు అర్చకులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.



శివాలయంలో హవన పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈఓ గీతారెడ్డి తదితరులు

ఆరు గ్యారంటీలతో అందరికీ న్యాయం

• నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కనగల్: కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కనగల్ మండలంలోని రేగట్టె, శాబ్దుల్లాపురం, పగిడిమర్రి, దోరేపల్లి, ఏమిరెడ్డిగూడెం, లింగాలగూడెం గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. నల్లగొండ నియోజకవర్గంలో తన హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప బీఆర్‌ఎస్ పాలనలో జరిగింది ఏమీ లేదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయడంలో విఫలం కావడంతో నిరుద్యోగులు ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోని ప్రజలకు వివరించి చేయి గుర్తుకి ఓటేయాలని అభ్యర్థించారు. తనను గెలిపిస్తే నల్లగొండను అన్నిరంగాల్లో ఆదర్శంగా నిలబెడతానని హామీ ఇచ్చారు. వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మందడి రామచంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, సర్పంచ్ గోలి నర్సిరెడ్డి, మాజీ సర్పంచులు గోలి జగాల్‌రెడ్డి, కేసాని వెంకటరెడ్డి, కోయ ప్రభాకర్‌రెడ్డి, రావుల వెంకటేశం, జక్కుల సైదులు, ఏమిరెడ్డి భూపాల్‌రెడ్డి, కాసర్ల మాధవరెడ్డి, కారింగు పురుషోత్తంగౌడ్, కారింగు స్వామి, ఖైరగోని శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్

మాడుగులపల్లి: మండలంలోని ఆగామోత్కూర్‌లో వివాహిత రమణ (38)ను గొంతుకోసి దారుణంగా హతమార్చి పరారైన ఆమె భర్తను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిందితుడిని మీడియా ఎదుట ప్రవేశపెట్టి సీఐ సత్యనారాయణ కేసు పూర్వాపరాలు వెల్లడించారు. వివరాలు.. ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన అవిరెండ్ల నాగయ్య, రమణకు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు సంతానం. చిన్నచిన్న విషయాలకే భార్యతో నాగయ్య గొడవ పడేవాడు. మూడు నెలల క్రితం భార్యతో గొడవ పడి ఆమెను తీవ్రంగా కొట్టి పుట్టింటికి పంపాడు. 20 రోజుల క్రితం పెద్ద మనుషులు సర్ది చెప్పడంతో రమణ అత్తారింటికి వచ్చింది. ఈ నెల 23న సాయంత్రం భర్త నాగయ్యను రమణ నూనె ప్యాకెట్ తేవాలని కోరగా గొడవ పడి సహనం కోల్పోయి చంపాలని నిర్ణయించుకున్నాడు. కాసేపటికి కుమార్తె కిరాణా దుకాణానికి వెళ్లడం.. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అదే అదునుగా భావించి కత్తితో భార్యపై విచక్షణారహితంగా దాడి చేసి గొంతు కోసి పరారయ్యాడు. శనివారం ఉదయం మాడుగులపల్లి టోల్ ప్లాజా వద్ద నిందితుడిని గుర్తించి పోలీసులు పట్టుకున్నారు. హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. సీఐ వెంట మాడుగులపల్లి ఎస్‌ఐ నరేష్ కుమార్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

పదేళ్లలో మిర్యాలగూడ ఎంతో అభివృద్ధి

• మిర్యాలగూడ బీఆర్‌ఎస్ అభ్యర్థి భాస్కర్‌రావు



మిర్యాలగూడ పట్టణంలోని ఓ షాపింగ్‌మాల్ వర్కర్స్‌ను ఓటు వేయాలని కోరుతున్న భాస్కర్‌రావు

మిర్యాలగూడ: గత పదేళ్లలో మిర్యాలగూడ పట్టణం ఎంతో అభివృద్ధి సాధించిందని బీఆర్‌ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పలుచోట్ల సుడిగాలి పర్యటన చేశారు. అడుగడుగునా ప్రజలు తమ అభిమాన నాయకుడిని కలుసుకోని ఆలింగనం చేసుకున్నారు. శనివారం పట్టణంలోని సాగర్‌రోడ్డు, రైతుబజార్, మున్సిపల్ కాంప్లెక్స్, హనుమాన్‌పేట తదితర ప్రాంతాల్లో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి, అన్నభీమోజు నాగార్జునచారి, సీనియర్ నాయకులు మదార్‌బాబా, మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లతో కలిసి ఎమ్మెల్యే భాస్కర్‌రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేసి ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. ఆయా దుకాణాదారులను, పనిచేసే వారిని కలుసుకోని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల విక్రేతలు, వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులు, కిరాణ దుకాణాదారులు, మొబైల్ దుకాణాదారులు, షాపింగ్ మాల్స్, మిఠాయి దుకాణాలు, చేపల వ్యాపారులు, మాసం విక్రయదారులు, ఆటో వాలాలను కలుసుకోని ఓట్లను అభ్యర్థించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పార్కులు, ఓపెన్ జిమ్‌లు, బ్రిడ్జిలు, నల్లగొండ బైపాస్ వైజంక్షన్, తడకమల్ల క్రాస్‌రోడ్డు, రాజీవ్‌చౌక్, సుందరయ్య జంక్షన్లు, ఈదులగూడ బైపాస్, హనుమాన్‌పేట ఫ్లైఓవర్ తదితర అభివృద్ధి పనులు చేపట్టి సౌకర్యవతంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావును మరోసారి గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ సిద్ధార్థ కోరారు. శనివారం పట్టణంలోని రైతుబజార్, ఎన్ఎస్పీ క్యాంపు, సాగర్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ఏఎంసీ మాజీ చైర్మన్ యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ ఓటర్లను అభ్యర్థించారు.

బీఆర్‌ఎస్‌లో 30 మంది చేరిక

పట్టణంలోని సీతారాంపురానికి చెందిన 30మంది యువకులు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి ర్యాంబో యూత్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సమన్వయంతో ఎమ్మెల్యే భాస్కర్‌రావు గెలుపునకు కృషి చేయాలని కోరారు.



మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న నల్లమోతు సిద్ధార్థ